

తుంగభద్ర డ్యామ్‌కు 300 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో

ప్రజాశక్తి - హోళగుంద

కర్ణాటక రాష్ట్రం శివమొగ్గ, ధవనగిరి, రాణి బెన్నూర్, తదితర ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు తుంగభద్ర డ్యామ్‌కు గత రెండు రోజులుగా రోజుకు 300 క్యూసెక్కుల ప్రకారం ఇన్‌ఫ్లో వస్తున్నట్లు బోర్డు అధికారులు తెలిపారు. ప్రస్తుతం తుంగభద్ర డ్యామ్‌లో 3 టిఎంసిల నీరు మాత్రమే ఉంది. ఈ రెండు, మూడు రోజుల్లో రుతుపవనాల కారణంగా మంచి వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఇన్‌ఫ్లో మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలిసింది. గతేడాది మే, జూన్ నెలలో ఎలాంటి ఇన్‌ఫ్లో ఉండేది కాదు. ఈ ఏడాది జూన్ నెలలో ఇన్‌ఫ్లో మొదలు కావడంతో త్వరలో డ్యామ్‌లోకి నీరు చేరే అవకాశాలు ఉన్నట్లు అధికారులు చర్చించుకుంటున్నారు. తుంగభద్ర డ్యామ్, ఎల్‌ఎల్‌సి కాలువపై ఆధారపడిన రైతులు తమ పొలాల్లో దుక్కులు మొదలుపెట్టారు. గతేడాది వర్షాలు లేక బెంగళూరు, ముంబయి తదితర ప్రాంతాలకు వలస వెళ్లిన రైతులు సైతం గ్రామాలకు వచ్చి చేరుకొని తమ తమ పొలాల్లో పనులు చేసుకుంటున్నారు. ఈసారైనా మంచి వర్షాలు కురిస్తే వలసలు వెళ్లకుండా ఇక్కడే పనులు చేసుకోవచ్చని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

కౌంటింగ్ నిబంధనలు తెలుసుకోవాలి

- జిల్లా ఎన్నికల అధికారి జి.సృజన - కౌంటింగ్ సూపర్‌వైజర్స్, అసిస్టెంట్లకు శిక్షణ



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ సృజన

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించిన నియమ నిబంధనలను గురించి క్షుణ్ణంగా తెలుసుకోవాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.సృజన కౌంటింగ్ సిబ్బందిని ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సాధారణ ఎన్నికలు-2024 కౌంటింగ్ నిర్వహణపై కౌంటింగ్ సూపర్వైజర్స్, కౌంటింగ్ అసిస్టెంట్‌లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కౌంటింగ్ ప్రక్రియపై రూపొందించిన మెటీరియల్ ను పూర్తి స్థాయిలో చదువుకొని నియమ నిబంధనల గురించి క్షుణ్ణంగా తెలుసుకోవాలని కౌంటింగ్ సిబ్బందిని ఆదేశించారు. మొబైల్ ఫోన్లు కౌంటింగ్ కేంద్రాల్లోకి అనుమతి లేదన్నారు. ఒకవేళ తీసుకొని వస్తే అక్కడ ఏర్పాటు చేసిన కౌంటర్స్ వద్దే వాటిని డిపాజిట్ చేయాల్సి ఉంటుందన్నారు. ప్రతి ఈవిఎం కౌంటింగ్ హాల్లో 14 టేబుల్స్ ఉంటాయని, పోటీలో ఉన్న అభ్యర్థుల సంఖ్యను బట్టి కౌంటింగ్ సమయంలో తేడా ఉంటుందన్నారు. రౌండ్ల వారీగా ప్రతి రౌండ్ పోల్ వివరాలను గట్టిగా ఏజెంట్లకు వినపడేలా అభ్యర్థుల వారీగా చదవాలన్నారు. ఈవిఎం కౌంటింగ్ సమయంలో కంట్రోల్ యూనిట్‌ను ఔటర్ కేస్‌లో ఉంచి కౌంటింగ్ సిబ్బంది ఇవ్వడం జరుగుతుందని, సీల్స్ తొలగించేటప్పుడు అడ్రెస్ ట్యాగ్ దారం దగ్గర మాత్రమే కత్తిరించాలని, గ్రీన్ పేపర్ సీల్ మీద ఉన్న నెంబర్ కట్ చెయ్యకుండా జాగ్రత్తగా సీల్ తొలగించాలని కలెక్టర్ కంట్రోల్ యూనిట్ చూపిస్తూ సిబ్బందికి అవగాహన కల్పించారు. కౌంటింగ్ తరువాత సదరు ట్యాగ్స్‌తో మళ్లీ సీల్ చేసే అవకాశం ఉంటుందన్నారు. కౌంటింగ్ సమయంలో సిబ్బందికి వారి టేబుల్స్ వద్దకే భోజనం అందజేస్తామని కౌంటింగ్‌కు అంతరాయం కలగకుండా సిబ్బంది సహకరించుకుంటూ కౌంటింగ్ పనులను పూర్తి చేయాలన్నారు. డమ్మీ పోస్టల్ బ్యాలెట్‌లను ప్రదర్శించి ఏది వ్యాలిడ్, ఏది ఇన్ వ్యాలిడ్ అని అవగాహన కల్పించారు. అనంతరం ఈవిఎం కౌంటింగ్ నిర్వహణపై ట్రైనింగ్ మేనేజ్మెంట్ నోడల్ అధికారులు సిద్ధలింగమూర్తి, సోమశేఖర్ రెడ్డి, పోస్టల్ బ్యాలెట్‌పై పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి సలీంబాషా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కౌంటింగ్ సిబ్బందికి అవగాహన కల్పించారు. సమావేశంలో డిఆర్‌ఓ మధుసూదన్ రావు, ట్రైనింగ్ మేనేజ్మెంట్ నోడల్ అధికారులు సోమశేఖర్ రెడ్డి, మారుతి ప్రసాద్, సిద్దలింగమూర్తి, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి సలీంబాషా, కౌంటింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బికెకు చేరిన ఎరువులు

ప్రజాశక్తి- దేవనకొండ



వ్యవసాయ ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతులకు అందుబాటులో ఉండేలా యురియా ఎరువులు దేవనకొండ ఆర్‌బికెకు శనివారం చేరుకున్నట్లు ఎఒ సురేష్‌బాబు తెలిపారు. కావాల్సిన రైతులు ఆర్‌బికెలో వ్యవసాయ శాఖ సిబ్బందితో సంప్రదించాలన్నారు.

ఓట్ల లెక్కింపునకు భద్రత ఏర్పాట్లు పూర్తి

- సిసి కెమెరాల నిఘాలో కౌంటింగ్ - కర్నూలులో ట్రాఫిక్ మళ్లింపు - ఎస్పీ జి.కృష్ణకాంత్

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

కర్నూలు నగరంలోని రాయలసీమ యూనివర్సిటి దగ్గర సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు అన్ని రకాల భద్రత ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ తెలిపారు. రాయలసీమ యూనివర్సిటిలో కట్టుదిట్టమైన భద్రత మధ్య, సీసీ కెమెరాల నిఘా నీడలో 4న కౌంటింగ్ జరుగుతుందని తెలిపారు. కౌంటింగ్ రోజు రాయలసీమ యూనివర్సిటి పరిసరాలలో ట్రాఫిక్ మళ్ళింపుపై జిల్లా ఎస్పీ ఏర్పాట్లను పరిశీలించారు. ఓట్ల లెక్కింపుకు వచ్చే వారు వారి వాహనాలను నిలిపేందుకు పార్కింగ్ ప్రదేశాలను కేటాయించారు. ట్రాఫిక్ మళ్ళింపును దృష్టిలో ఉంచుకుని కర్నూలు పట్టణ ప్రజలు, వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని కోరారు. 4న ఉదయము 4 గంటల నుండి నంద్యాల చెక్ పోస్టు వైపు నుండి రాయలసీమ యూనివర్సిటీకి వచ్చే వాహనాలు కేవలం 8 అసెంబ్లీ నియోజకవర్గాలు మరియు 1 పార్లమెంటు నియోజకవర్గం ఎన్నికల లెక్కింపు విధులలో ఉండే సిబ్బంది, సంబంధిత అధికారులు, నియోజకవర్గ అభ్యర్థులు వారి ఏజెంట్ల యొక్క వాహనాలకు మాత్రమే అనుమతి ఉందని చెప్పారు. నంద్యాల చెక్ పోస్టు, జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీ, దిన్నేదేవరపాడు - నంద్యాల రోడ్డు, బి.తాండ్రపాడు రోడ్డు, పసుపుల రోడ్డు వైపు వెళ్ళే ఇతర వాహనదారులకు అనుమతి లేదని అన్నారు. నంద్యాల చెక్ పోస్టు నుండి బి.తాండ్రపాడు, నన్నూరు టోల్ ప్లాజా, నంద్యాల వైపు వెళ్ళే వాహనదారులు మరియు బద్రీనాథ్ నగర్, మారుతి మెగాసిటి, శిల్పా టౌన్ షిప్ కాలనీ వాసులు, నంద్యాల చెక్ పోస్టు-రాయలసీమ యూనివర్సిటీ మెయిన్ రోడ్డులో కాకుండా దిన్నెదేవరపాడు, మిలిటరీ క్యాంటీన్, బిర్లా జంక్షన్ మరియు జొహరాపురం రోడ్డు వైపుగా వెళ్ళవచ్చునని తెలిపారు. నంద్యాల వైపు నుండి కర్నూలు పట్టణానికి వచ్చే ఆర్‌టిసి బస్సులు, ఇతర వాహనాలు నన్నూరు టోల్ గేటు, ఔటర్ రింగ్ రోడ్డు మీదుగా గుత్తి పెట్రోల్ బంకు, చెన్నమ్మ సర్కిల్, బళ్ళారి చౌరస్తా మీదుగా కర్నూలు పట్టణంలోకి వెళ్ళవచ్చునన్నారు. హైదారాబాద్ వైపు నుండి వచ్చే వాహనాలు యథావిధిగా కర్నూలు వైపు రావచ్చు, వెళ్ళవచ్చును అని చెప్పారు. నందికొట్కూరు, ఆత్మకూరు, శ్రీశైలం , విజయవాడకు కర్నూలు వైపు నుండి వెళ్ళే ఆర్టీసి బస్సులు, ఇతర వాహనదారులు యథా విధిగా రాకపోకలను సాగించవచ్చున్నారు. డోన్ వైపుకు కర్నూలు నుండి వెళ్ళే ఆర్టీసి బస్సులు, ఇతర వాహనాదారులు యథా విధిగా రాకపోకలను సాగించవచ్చు అన్నారు. జూన్ 4 వ తేదిన ఓట్ల లెక్కింపు ఉన్నందున నంద్యాల వైపు నుండి కర్నూలు వైపు వచ్చే వాహనదారులు, దూర ప్రాంతాలలో ఉన్న తమకు సంబంధించిన వారికి, బంధువులకు కర్నూలు పట్టణంలో ట్రాఫిక్ మళ్ళింపు ఉన్నదని విషయం తెలియజేసి, వారి మార్గం సుగమం చేసుకోని ప్రయాణించి పోలీసు వారికి సహకరించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఎస్పీ వెంట అడిషనల్ ఎస్పీ అడ్మిన్ నాగరాజు, కర్నూలు డిఎస్పీ విజయశేఖర్, కర్నూలు స్పెషల్ బ్రాంచ్ సిఐ నాగరాజ్ యాదవ్, కర్నూలు తాలుకా సిఐ శ్రీధర్, కర్నూలు ట్రాఫిక్ సిఐ గౌతమి ఉన్నారు.



పోలీసు అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణకాంత్


బెట్టింగ్ జోరు...

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఉమ్మడి కర్నూలు జిల్లాలో పొలిటికల్ బెట్టింగ్ ఊపందకుంది. ఈనెల 13న సార్వత్రిక ఎన్నికల పోలింగ్ జరిగింది. సార్వత్రిక ఎన్నికల ఫలితాల ప్రకటనకు గడువు సమీపిస్తున్న కొద్దీ ఫలితాలపై బెట్టింగుల జోరు పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ఫలితాలపై ఉత్కంఠ నెలకొంది. పోలింగ్ శాతం పెరగడంతో ఓటరు నాడి అంచనా వేయడం కష్టతరంగా మారింది. పోలింగ్‌కు, ఫలితాలకు మధ్య మూడు వారాల వ్యవధి ఉండడంతో జూదరులకు వరంగా మారింది. సాధారణ ప్రజల్లో సైతం గెలుపోటములపై చర్చ నడుస్తోంది. పట్టణ, గ్రామీణ ప్రాంతాలని తేడా లేకుండా గెలుపోటములపై రూ.లక్షల నుంచి రూ.కోటి వరకు బెట్టింగ్ పెడుతున్నారు. ఏ నియోజకవర్గంలో ఎవరు గెలుస్తారంటూ స్నేహితులు, బంధువులు, సహోద్యోగులు ఫోన్లు చేసి ఆరా తీస్తున్నారు. గత ఎన్నికలతో పోల్చి ప్రస్తుత పోలింగ్ సరళి ఎవరికి అనుకూలంగా ఉంటుందో విశ్లేషిస్తున్నారు. నిన్న, మొన్నటి వరకూ కేవలం క్రికెట్ మ్యాచ్‌లకు పరిమితమైన బెట్టింగ్ ఇప్పుడు రాజకీయాల్లోకి కూడా వచ్చింది. రూ.లక్షలతో ప్రారంభమైన బెట్టింగ్‌లు రూ.కోట్లకు చేరుతున్నాయి. ప్రభుత్వం మారుతుందని ఒకవైపు, మరోవైపు అభ్యర్థుల గెలుపు, ఈ రెండింటినీ మించి ప్రధాన పార్టీ అధినేతల మెజారిటీపైనా బెట్టింగులు సాగుతున్నాయి. ప్రధాన పార్టీలైన వైసిపి, కూటమి మధ్యే రసవత్తర పోరు సాగుతోంది. గతంలో పోలింగ్ జరిగిన మరునాటికి ఏ పార్టీ గెలుస్తుంది, ఏ పార్టీ అధికారంలోకి రావచ్చన్నది పోలింగ్ సరళి ఆధారంగా విశ్లేషకులు చెప్పగలిగే వారు. కానీ ఈ దఫా ఎన్నికల్లో విశ్లేషకులు సైతం ఓటరు నాడీ పట్టలేకపోతున్నారు. దీనికి తోడు పోలింగ్ సమయం ముగిసిన తర్వాత ఓటర్లు పోలింగ్ బూత్‌ల వద్ద బారులు తీరడం, ప్రజలు ఓపికగా ఓటు హక్కును వినియోగించుకోవడం, పోస్టల్ బ్యాలెట్లను గతం కంటే ఎక్కువగా ఉద్యోగులు ఉపయోగించుకోవడం, ఇతర ప్రాంతాల్లో ఉన్న వారు సైతం ఓటింగ్‌కు తరలిరావడం ఈ ఎన్నికల్లో ప్రత్యేకతలుగా భావిస్తున్నారు. వాస్తవానికి ఓటింగ్ శాతం పెరిగిందంటే ప్రభుత్వంపై వ్యతిరేకతేనన్న సంకేతాలుగా చెప్పేవారు. కానీ ఈ దఫా ఎన్నికల్లో పెరిగిన ఓటరు చైతన్యం ప్రభుత్వానికి అనుకూలమని వైసిపి అంటుంటే, కచ్చితంగా ప్రభుత్వంపై వ్యతిరేకతేనని కూటమి చెబుతోంది. దీనిపై విశ్లేషకులు కూడా స్పష్టంగా మాట్లాడలేని పరిస్థితి ఉంది.

అరకొరగా పాఠ్య పుస్తకాలు : మొదటి రోజే విద్యార్థులందరికీ పాఠ్య పుస్తకాలిస్తామని ప్రభుత్వం గొప్పలు చెబుతోంది. క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి కనిపించడం లేదు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు 27 టైటిల్స్‌కు సంబంధించి 46,98,726 పాఠ్య పుస్తకాలు అవసరమని జిల్లా విద్యా శాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదించగా జిల్లాకు ఇప్పటి వరకు 5,40,752 పాఠ్య పుస్తకాలు మాత్రమే అందాయి. గతేడాదికి ఈ ఏడాదికి తేడా చూస్తే 4,73,298 పాఠ్య పుస్తకాలు ప్రతిపాదనల్లోనే తగ్గాయి. విద్యార్థులకు అవసరమైన స్థాయిలో పుస్తకాలు రాకపోవడం వల్ల పాఠశాలలు ప్రారంభం అయ్యే నాటికి విద్యార్థులందరికీ అన్ని సబ్జెక్టుల పుస్తకాలు అందడం అనుమానంగానే ఉంది.

కీలకం కానున్న పోస్టల్ బ్యాలెట్లు : ఉమ్మడి కర్నూలు జిల్లాలో సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు అధికారులు ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు. కౌంటింగ్ ప్రక్రియ తొలుత పోస్టల్ బ్యాలెట్లతోనే ప్రారంభం కానుంది. కర్నూలు జిల్లాకు సంబంధించి 14 టేబుళ్లలో పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపును చేపట్టనున్నారు. ఒక్కో టేబుల్‌కు 1,229 ఓట్లను లెక్కించునన్నారు. నంద్యాల జిల్లాకు సంబంధించి 17 టేబుళ్లలో పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపును చేపట్టనున్నారు. ఒక్కో టేబుల్‌కు 1,488 ఓట్లను లెక్కించనున్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పెద్ద సంఖ్యలో పోలైన నేపథ్యంలో పలు ప్రాంతాల్లో ఆ ఓట్లు కీలకం కానున్నాయి.





2డి ఎకో మిషన్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ చింత ప్రభాకర్‌రెడ్డి, డిఎంహెచ్ఒ, వైద్యులు

జిజిహెచ్‌లో అల్ట్రా సౌండ్, 2డి ఎకో మిషన్ ప్రారంభం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ : కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఎఎంసి విభాగంలో అల్ట్రా సౌండ్ , 2డిఎకో మిషిన్‌ను ఆసుపత్రి సూపరిన్‌టెన్‌డెంట్ డాక్టర్ చింత ప్రభాకర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎఎంసి విభాగంలో అధునాతన వైద్య పరికరాలతో చికిత్స అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఎఒ శ్రీనివాసరెడ్డి వినతిపత్రం ఇస్తున్న రైతుసంఘం నాయకులు

రాయితీపై విత్తనాలు , ఎరువులు అందించాలి

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

రైతులకు 90 శాతం రాయితీపై విత్తనాలు, ఎరువులు అందించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో కల్లూరు మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం మండల కార్యదర్శి ఎ.కృష్ణ మాట్లాడుతూ గత రెండు మూడు సంవత్సరాలుగా సక్రమంగా వర్షాలు కురవక, నకిలీ పత్తివిత్తనాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. గత సంవత్సరం అతి తక్కువ వర్షపాతం నమోదు కావడంతో పంటలన్నీ ఎండిపోయాయని, ప్రభుత్వం కరువు మండలంగా గుర్తించి కరువు సహాయక చర్యలు పూర్తిస్థాయిలో చేపట్టడంలో విఫలం అయిందన్నారు. ఇప్పటికైనా వ్యవసాయ శాఖ అధికారులు నాణ్యమైన విత్తనాలు ఆర్‌బికె కేంద్రాల ద్వారా 90 శాతం రాయితీతో రైతులందరికీ అందించాలని డిమాండ్ చేశారు. నకిలీ పత్తి విత్తనాలు అమ్మిన డీలర్ల పైన , అధిక ధరలకు అమ్ముతున్న డీలర్ల పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులతో పాటు కౌలుదారులకు కూడా సబ్సిడీ విత్తనాలు ఇవ్వాలని కోరారు. వ్యవసాయ అధికారి శ్రీనివాస రెడ్డి స్పందిస్తూ మీరు ఇచ్చిన వినతి పత్రాన్ని పై అధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కె.మధు, రైతులు లక్ష్మీపురం భాస్కర్ రెడ్డి, దూపాడు హరిబాబు, పందిపాడు శీను తదితరులు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరం విజయవంతం

సుందరయ్య స్ఫూర్తికేంద్రం కన్వీనర్ జెఎన్.శేషయ్య

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

సుందరయ్య స్ఫూర్తికేంద్రం ఆధ్వర్యంలో వీకర్‌సెక్షన్ కాలనీ ప్రజాశక్తి ఎడిషన్ కేంద్రంలో నిర్వహించిన వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరం విజయవంతమైందని స్ఫూర్తికేంద్రం కన్వీనర్ జెఎన్.శేషనయ్య అన్నారు. గత 15 రోజులుగా నిర్వహించిన కార్యక్రమానికి విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించిందని అన్నారు. 25 నుంచి 30 మంది విద్యార్థులు వీకర్ సెక్షన్ కాలనీ వేసవి విజ్ఞాన శిక్షణకు హాజరయ్యారని తెలిపారు. జె.రంగస్వామి అధ్యక్షతన జరిగిన ముగింపు కార్యక్రమంలో శేషయ్య మాట్లాడారు. ఈ వేసవి శిబిరంలో మ్యాథమేటిక్స్, ఇంగ్లీషు, హిందీ సబ్జెకులపై ప్రాథమిక అవగాహన కల్పించామన్నారు. వీటితో పాటు ఆట, పాటలు, దేశభక్తి గేయాలను కూడా విద్యార్థులకు నేర్పించామన్నారు. ఈశిక్షణలో లెక్కల మాస్టారు డి.ఈశ్వరయ్య, మాసుంబాష, జయరాజు, యహోషువ, బసవరాజు, కుమారి హప్స బోధించారని చెప్పారు. ముఖ్యఅతిథిగా హాజరయిన లెక్కల మాస్టారు డి.ఈశ్వరయ్య మాట్లాడుతూ విద్యార్థులు వేసవిలో సమయం వృధా చేయకుండా విజ్ఞాన శిబిరానికి రావడం అభినందనీయమని అన్నారు. ఈ రోజుల్లో సెల్‌ఫోన్లతో విద్యార్థులు సమయం వృథా చేసుకుంటున్నారని, సెల్‌ఫోన్లతో తక్కువ జిబిమెమోరి ఉంటుందని, మనిషి మేధస్సులో రెండున్నర లక్షల జిబి కెపాసిటీ ఉందన్నారు. దానికి ఎక్కువ పని పెట్టిన వారు విజయాలు సాధిస్తారని, వారు నిజమైన హీరోలవుతారని చెప్పారు. తల్లిదండ్రులకు సహకరించాలని, వారు చెప్పిన విషయాలను గౌరవించాలని సూచించారు. గాయకుడు రచయిత బసవరాజు మాట్లాడుతూ విద్యార్థులు శక్తివంతమైన జ్ఞాన సమపార్జనతో అద్భుత విజయాలు సాధిస్తారని చెప్పారు. అనేక ఉదాహరణలు చెప్పి చిన్నారులను ఆకట్టుకున్నారు. ప్రజాశక్తి జనరల్ మేనేజర్ నరసింహులు మాట్లాడుతూ శిక్షణా శిబిరంలో పాల్గొని విజ్ఞానాన్ని పొందడానికి ప్రయత్నించిన విద్యార్థులను అభినందించారు. విజ్ఞానకేంద్రం నిర్వహకులు బసవయ్య, రంగస్వామి మాట్లాడుతూ విద్యార్థుల కృషిని అభినందించారు. వారి అనుభవాలను పంచుకున్నారు. ఈ శిబిరంలో చక్కటి ప్రదర్శన చూపిన విద్యార్థులకు బహుమతులను లెక్కల మాస్టర్ ఈశ్వరయ్య స్పాన్సర్ చేశారు. అనంతరం శిక్షణకు హాజరయిన విద్యార్థులందరికీ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.



వేసవి విజ్ఞాన శిబిరంలో సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులతో నిర్వహకులు

విత్తన దుకాణాలలో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-వెల్దుర్తి



కర్నూలు విజిలెన్స్ ఎస్‌పి రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ ఆదేశాల మేరకు పిటి. కేశవ రెడ్డి , సిఐ విజిలెన్స్ అండ్ ఎన్‌పోర్స్‌మెంట్, పి . చంద్ర శేఖర్ రెడ్డి, డిఇవిజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఆర్. అక్బర్ బాషా మండల వ్యవసాయ అధికారులు వెల్దుర్తి పట్టణంలోని విత్తన దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేసి దుకాణాలోని రిజిస్టర్లను, స్టాకు బోర్డులను, లైసెన్స్‌లను, అనుమతి పత్రాలను, గోడౌన్‌లలో ఉన్న విత్తన నిల్వలను తనిఖీ చేశారు. శ్రీబాలాజీ సీడ్స్ , పెస్టిసైడ్స్ దుకాణాలలో స్టాకు రిజిస్టరులో నమోదు చేయని నవభారత్ కాంపెనీకి చెందిన 414 ఆముదం విత్తన పాకెట్లు వాటి ధర సుమారు రూ.3,29,130 అమ్మకాలను తాత్కాలికంగా నిలుపుదల చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. రైతులకు తప్పనిసరిగా లాట్ నెంబరు, ఇతర సమాచారాన్ని కనబర్చి బిల్ ఇవ్వాలని ఆదేశించారు. అనుమతి లేని విత్తనాలు రైతులకు అమ్మితే అట్టి వారి పై విత్తన చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఎంఆర్‌పికి మించి రైతులకు విత్తనాలు విక్రయించరాదని ఆదేశించారు.

ఉద్యోగ విరమణ సహజం: ఆర్‌డిఒ

ప్రజాశక్తి-పత్తికొండ




నాగభూషణంను అభినందిస్తున్న ఆర్‌డిఒ

ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ సహజమని , ఉద్యోగంలో ఉన్నప్పుడు నాగ భూషణం చేసిన సేవలు మరువ లేనివని పత్తికొండ ఆర్‌డిఒ నీలపు రామలక్ష్మి పేర్కొన్నారు. శనివారం ఆర్‌డిఒ కార్యాలయ ప్రాంగణంలో ఎపిఎన్‌జిఒ ఆధ్వర్యంలో అడ్మినిస్ట్రేటివ్ అధికారి నాగభూషణంకు ఉద్యోగ విరమణ కార్యక్రమం నిర్వహించారు. ఆర్‌డిఒ మాట్లాడుతూ 37ఏళ్ల కాలంలో టైపిస్టు, సీనియర్ అసిస్టెంట్, డిప్యూటీ తహశీల్దార్,తహశీల్దార్ అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా ఉద్యోగరీత్యా ప్రజలకు మెరుగైన సేవలు అందించారని కొనియాడారు. కుటుంబ సభ్యులతో ఆయురారోగ్యాలతో శేష జీవితం గడపాలని ఆకాంక్షించారు. నాగభూషణ సతీమణి కిరణ్మయికి శాలువా వేసి పూలమాలతో ఘనంగా సన్మానించారు. పత్తికొండ తహశీల్దార్ మాధవరాజు, డిప్యూటీ తహశీల్దార్ లక్ష్మీనారాయణ, ఆర్‌ఐ లక్ష్మీ కాంత్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ ఈరమ్మ మండల సర్వేయర్ నారాయణ, విలేజ్ సర్వే బీరప్ప, హోసూర్ విఆర్‌ఒ తిమ్మయ్య సుజిత్ పాల్గొన్నారు

నేడు 'అలుపెరుగనిపోరాటం' పరిచయ సభ

ప్రజాశక్తి-కర్నూల్ కల్చరల్



న్యూస్‌క్లిక్ వ్యవస్థాపకుడు ప్రబీర్ పుర్కాయస్థ రచించిన అలుపెరుగనిపోరాటం పుస్తక పరిచయ సభ ఆదివారం ఉ. 10.00 కర్నూలు నగరంలోని లలిత కళాసమితి నిర్వహిస్తున్నట్లు వివిధ ప్రజాసంఘాల నాయకులు తెలిపారు. పుర్కాయస్తను ఉపాచట్టం ప్రయోగించి దాదాపు 7 నెలలు అక్రమంగా కేంద్రం జైలుకు పంపింది. ఆధారాలు ఋజువు చేయకపోవడంతో ఢిల్లీ కోర్టు ఆయనకు ఇటీవల షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ప్రబీర్ పుర్కాయస్థ జీవితం పోరాటాలమయం. భోపాల్ గ్యాస్ బాధితుల పక్షాన పోరాడటంలో, ఢిల్లీ సరిహద్దుల్లో జరిగిన రైతు ఉద్యమంలోనూ ఆయన పాత్ర అనిర్వచనీయం. ఈ నేపథ్యంలో ఉద్యమ జీవితంపై ఆయన రాసిన అలుపెరుగని పోరాటం పుస్తకం పరిచయం చేయాలని వివిధ ప్రజాసంఘాలు భావించాయన్నారు. పుస్తక పరిచయ సభకు సభాధ్యక్షులుగా కెంగార మోహన్ వ్యవహారిస్తారని, పుస్తకపరిచయాన్ని యు. నరసింహ చేస్తారని, పుస్తకాన్ని న్యాయవాది వై.జయరాజు ఆవిష్కరిస్తారన్నారు. వక్తలుగా ఐలు రాష్ట్ర అధ్యక్షులు కెంగార కుమార్, యుటిఎఫ్ రాష్ట్రసహాధ్యక్షులు సురేష్ కుమార్, జెవివి నాయకులు డాక్టర్ కె.బడేసాహెబ్ పాల్గొంటారు. సభకు కవులు, రచయితలు, జర్నలిస్టులు, ఉపాధ్యాయులు, కళాకారులు, ప్రజాసైన్స్ కార్యకర్తలు, సామాజికవేత్తలు, ఉద్యమనాయకులు, కార్యకర్తలు విరివిగా హాజరై సభను జయప్రదం చేయాలని కోరారు.



హైదరాబాద్‌లో విశాలాక్షిదేవిని అభినందిస్తున్న ఎడ్లూరి శివారెడ్డి తదితరులు

రచయిత్రి విశాలాక్షిదేవికి బాలసాహిత్య అవార్డు

ప్రజాశక్తి-కర్నూలు కల్చరల్

నేడు హైదరాబాదులో జరిగిన మాతృమూర్తి కోడూరు శాంతమ్మ స్మారక బాల సాహిత్య సమ్మేళనంలో కర్నూలుకు చెందిన ప్రముఖ బాలసాహిత్య రచయిత్రి టి.విశాలాక్షిదేవికి బాలల కథల విభాగంలో రెండవ బహుమతి లభించింది. ఈ కార్యక్రమం తెలంగాణ సారస్వత పరిషత్తు వారి ఆధ్వర్యంలో ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించారని విశాలాక్షిదేవి భర్త, ప్రముఖ నవల, కథా రచయిత వియోగి తెలిపారు. రెండువందల బాలల కథల్లో పది కథలను ఎంపిక చేయగా విశాలాక్షిదేవి కథకు రెండవ బహుమతి రావడం పట్ల పలువురు సాహితీవేత్తలు హర్షం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య ఎండ్లూరిశివారెడ్డి, ఎం.రాధారెడ్డి, పాలడుగు సరోజినిదేవి, డాక్టర్ పత్తిపాక మోహన్, డాక్టర్ జె.చెన్నయ్య, సిఎ.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


విజయ్ కుమార్‌ను సన్మానిస్తున్న ఎంఇఒలు, యుటిఎఫ్ నాయకులు

ఆదర్శ ఉపాధ్యాయులు విజయ్ కుమార్

- ఎంఇఒలు రామాంజనేయులు, నీలకంఠ

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయులుగా పనిచేస్తూ విరమణ పొందిన ఉపాధ్యాయులు కె.విజయ్ కుమార్ ఆదర్శ ఉపాధ్యాయులని ఎంఇఒలు, యుటిఎఫ్ నాయకులు కొనియాడారు. శనివారం విజయ్‌కుమార్‌ను మండల విద్యా శాఖ అధికారులు రామాంజనేయులు, నీలకంఠ యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ పాటి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎల్లప్ప, రాష్ట్ర సహా అధ్యక్షులు హేమంత్ కుమార్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గత 40 సంవత్సరాలుగా సైన్స్ జీవితంగా విద్యార్థులకు పాఠాలు బోధిస్తూ ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారని తెలిపారు. ముఖ్యమంత్రి, గవర్నర్, కలెక్టర్ చేతులమీదుగా ఎన్నో ప్రశంసా పత్రాలు పొందిన ఆదర్శ ఉపాధ్యాయులు విజయకుమార్ అని కొనియాడారు. ఆయన ఉద్యోగ విరమణ పొందడం విద్యార్థులకు తీరని లోటని తెలిపారు. ఆయన సామాజిక స్పృహతో జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులుగా ఉంటూ ప్రజల్లో ఉన్న దురాచారాలు, మూఢనమ్మకాలను దూరం చేసి వారిని చైతన్యం చేశారని చెప్పారు. లయన్స్ క్లబ్ జీవితకాలపు సభ్యులుగా ఉండి ఎన్నో సేవలు అందించాలని కొనియాడారు. అనంతరం ఆయనను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. యుటిఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ శ్రీనివాసులు, సభ్యులు కౌలన్న, జిల్లా కార్యదర్శి నరసింహులు, జిల్లా కౌన్సిల్ సభ్యులు గుమ్మల బాబు, జిక్రియా, మండల కార్యదర్శి చంద్రపాల్, ప్రధానోపాధ్యాయులు రహమతుల్లా, సీనియర్ నాయకులు ఎఎన్.రావు, రామన్ పాల్గొన్నారు.

బస్టాండ్ కంపు.. కంపు...

- మురుగునీరు, వర్షపు నీటి నిల్వతో దుర్వాసన

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలోని ఆర్‌టిసి బస్టాండ్ మురుగునీరు నిల్వ ఉండడంతో కంపు కొడుతోంది. రాఘవేంద్ర స్వామి దర్శనార్థమై దేశ నలుమూలల నుంచి వచ్చిన భక్తులు ముక్కులు మూసుకుని ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. బస్టాండ్ ఆవరణలో నీటి పారుదలకు అవకాశం లేక కొద్దిపాటి వర్షానికి కూడా నీరు నిలుస్తోంది. బస్టాండ్‌లోని మురుగుదొడ్ల నిర్వహణకు సంబంధించిన డ్రెయినేజీ నీరు చాంబర్ నుంచి వెళ్లేందుకు అవకాశం లేక నిలిచిపోతున్నాయి. దీంతో దుర్వాసన వెదజల్లుతోంది. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న మోటారు ద్వారా పంపింగ్ చేస్తేనే నల్లవాగు వైపు వెళతాయి. 1986-87లో అప్పటి టిడిపి ప్రభుత్వం హయాంలో నాటి ఎమ్మెల్యే బీవీ.మోహన్ రెడ్డి కాలంలో ప్రయాణికులు, భక్తుల సౌకర్యార్థం ఆర్‌టిసి బస్టాండ్ నిర్మించారు. నేడు ప్రయాణికులు, భక్తుల సంఖ్య వేలల్లో పెరగడంతో పాటు ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల బస్సులతో ఎప్పుడూ రద్దీగా ఉంటోంది. దేశంలోనే అతిపెద్ద పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో ఇలాంటి దుస్థితి నెలకొనడంతో భక్తులు, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి భక్తుల రాకను దృష్టిలో పెట్టుకుని ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాల కల్పనతో పాటు ఆర్‌టిసి బస్టాండ్‌ను పరిశుభ్రంగా ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, భక్తులు కోరుతున్నారు.


బస్టాండ్‌లో నిల్వ ఉన్న మురుగునీరు


బస్టాండ్ ఆవరణలో పారుతున్న మురుగునీరు


మాట్లాడుతున్న కమిషనర్ రామచంద్రరెడ్డి

రూ.33 కోట్లతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం

- మున్సిపల్ కమిషనర్ రామచంద్ర రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని పట్టణంలో రూ.33 కోట్ల వ్యయంతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ రామచంద్ర రెడ్డి తెలిపారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. పట్టణంలోని పాతబస్టాండ్ మైదానంలో పనులు మొదలయ్యాయని తెలిపారు. పునాది మట్టం గట్టి నేల వచ్చే వరకు తవ్వించి గ్రౌండ్ లెవెల్‌లో లెంటల్ బీమ్స్ వరకు జరిగిందని చెప్పారు. పునాది గట్టిగా ఉన్నప్పుడే నిర్మాణం ఎక్కువ కాలం నిలుస్తుందన్నారు. నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటిస్తూ పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. షాపింగ్ కాంప్లెక్స్‌లో సుమారు 180 దుకాణాల నిర్మాణం జరుగుతోందన్నారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో 77, ఫస్ట్ ఫ్లోర్‌లో 77, సెకండ్ ఫ్లోర్‌లో 26 చొప్పున దుకాణాలు నిర్మిస్తున్నామని తెలిపారు. ఒక్కో బ్లాక్‌కు రెండు టాయిలెట్స్ చొప్పున నిర్మిస్తున్నామని చెప్పారు. ప్రతి ఫ్లోర్‌కు ఆధునిక పద్ధతిలో లిఫ్ట్ సదుపాయం ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రతి ఫ్లోర్‌కు 5 ఎగ్జిట్, ఎంట్రీస్ ఉండేలా డిజైన్ రూపకల్పన చేశామన్నారు. అగ్రిమెంట్ కాలం ముగిసేలోపు దుకాణాల నిర్మాణం పూర్తి చేసి లబ్ధిదారులకు కేటాయించేలా ఏర్పాట్లు చేస్తామని వివరించారు.

పంట నష్టపరిహారం

రైతుల ఖాతాకు జమ చేయాలి

- ఎపి రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి - ఆలూరు


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆలూరులో రైతులకు ఖరీఫ్, రబీ సీజన్‌లో పంట నష్టపరిహారం వెంటనే జమ చేయాలని ఎపి రైతుసంఘం మండల కార్యదర్శి ఈరన్న కోరారు. శనివారం తహశీల్దార్ కార్యాలయంలో ఎఎస్ఒ ఈశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు ఈరన్న, సిఐటియు నాయకులు కెపి.నారాయణ స్వామి మాట్లాడారు. గత ఖరీఫ్ పంట నష్టపరిహారం డబ్బులు కొంతమందికి మాత్రమే జమ చేశారని తెలిపారు. మిగిలిన వారి ఖాతాలో వెంటనే జామచేయాలని కోరారు. రబీ పంట నష్టపరిహారం వేసి, ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు 90 శాతం సబ్సిడీతో రైతులకు విత్తనాలు పంపిణీ చేయాలని తెలిపారు. నాణ్యమైన విత్తనాలు ఫర్టిలైజర్ దుకాణాలమ్మే విధంగా చూడాలన్నారు. నాయకులు షాకీర్, గౌడ్, గోవర్ధన్ పాల్గొన్నారు.

కౌంటింగ్‌కు సర్వం సిద్ధం

- ఎన్నికల జనరల్ అబ్జర్వర్ మీర్ తారిఖ్ అలీ

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

సాధారణ ఎన్నికలు-2024 కౌంటింగ్ ఈ నెల 4న జరగనున్న సందర్భంగా అందుకు తగిన ఏర్పాట్లను పూర్తి చేశామని సాధారణ ఎన్నికల జనరల్ అబ్జర్వర్ మీర్ తారిఖ్ అలీ పేర్కొన్నారు. స్థానిక రాష్ట్ర ప్రభుత్వ అతిథి గృహంలో సాధారణ ఎన్నికల కౌంటింగ్ నిర్వహణపై ఆదోని, ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. సాధారణ ఎన్నికల జనరల్ అబ్జర్వర్ మీర్ తారిఖ్ మాట్లాడుతూ ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో సమావేశమై పలు కీలక సూచనలు చేశారు. క్రియాశీలకమైన సందర్భంలో ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా ఎలా ముందుకు వెళ్లాలనే విషయాలను వారికి వివరించారు. పరిస్థితులకు అనుగుణంగా అధికారులు తక్షణమే స్పందించాలని ఆదేశించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు అవకాశం ఇవ్వకూడదన్నారు. గత వైఫల్యాలు ఏమైనా జరిగివుంటే పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని వివరించారు. ఇప్పటి వరకు జరిగిన ఏర్పాట్లకు సంబంధించి నియోజకవర్గం వారీగా రిటర్నింగ్ అధికారులతో చర్చించి ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశంలో ఆదోని రిటర్నింగ్ అధికారి, సబ్ కలెక్టర్ శివ నారాయణ్ శర్మ, పత్తికొండ రిటర్నింగ్ అధికారి రామలక్ష్మి, ఆలూరు రిటర్నింగ్ అధికారి రాము నాయక్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎన్నిల జనరల్ అబ్జర్వర్ మీర్ తారిఖ్ వలీ

కోట్లను కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు


కోట్లతో చర్చిస్తున్న ఎమ్మిగనూరు టిడిపి నాయకులు

కేంద్ర మాజీ మంత్రి, టిడిపి జాతీయ ఉపాధ్యక్షులు, టిడిపి డోన్ అసెంబ్లీ అభ్యర్థి కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డిని టిడిపి నాయకులు కలిశారు. శనివారం టిడిపి నాయకులు, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ కె.పార్థసారథి రెడ్డి, కదిరికోట ఆదెన్న, టిడిపి కురువ సాధికారిక కర్నూలు పార్లమెంట్ నియోజకవర్గ కమిటీ సభ్యులు అడ్వకేట్ కెటి.మల్లికార్జున డోన్ పట్టణంలో కోట్ల నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కోట్ల మాట్లాడారు. రాష్ట్రంలో కూటమిదే అధికారమని తెలిపారు. కార్యకర్తలకు అండగా ఉంటానని పేర్కొన్నారు.

ముగిసిన ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులు

- విద్యార్థులు రీల్ హీరోల్లా కాకుండా రియల్ హీరోల్లా ఉండాలి - యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎల్లప్ప

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్లలోని బస్టాండ్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో గత 25 రోజులుగా ఉపాధ్యాయులు రామన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులు శనివారం ముగిశాయి. యుటిఎఫ్ మండల ఆధ్వర్యంలో శనివారం ముగింపు సభ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖ అధికారులు రామాంజనేయులు, నీలకంఠతోపాటు యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జె.ఎల్లప్ప, రాష్ట్ర సహ అధ్యక్షులు హేమంత్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.నవీన్ పాటి యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సెలవుల్లో కుటుంబ సభ్యులతో కాలక్షేపం చేయకుండా పిల్లలపై ప్రత్యేక శ్రద్ధతో, సేవాభావంతో ఉచిత ఇంగ్లీష్ తరగతులు నిర్వహిస్తున్న నిర్వాహకులు, ఉపాధ్యాయులు రామాంజనేయులును వారు అభినందించారు. ఇలాంటి ఉపాధ్యాయులు యుటిఎఫ్‌లో ఉండడం గర్వకారణమని తెలిపారు. విద్యార్థులు కూడా సమయం దొరికితే సెల్‌ఫోన్ రీల్స్ చేసే హీరోలను ఫాలో అవ్వకుండా ఇలాంటి తరగతుల ద్వారా ఇంగ్లీష్ భాషపై పట్టు సాధించడంతోపాటు బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకుని రియల్ హీరోలుగా మారాలని సూచించారు. గత మూడేళ్లుగా విద్యార్థులకు ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులను నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు రామాంజనేయులును శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఆడిట్ కమిటీ కన్వీనర్ శ్రీనివాసులు, సభ్యులు కౌలన్న, జిల్లా కార్యదర్శి నరసింహులు, జిల్లా కౌన్సిల్ సభ్యులు గుమ్మలబాబు, జిక్రియా, మండల ప్రధాన కార్యదర్శి చంద్రపాల్, సీనియర్ నాయకులు నాగేశ్వరరావు, కె.విజయకుమార్, ప్రధానోపాధ్యాయులు రహమతుల్లా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ పాటి



మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎల్లప్ప

చిన్నన్నపై బైండోవర్

- ఎస్ఐ గోపీనాథ్

ప్రజాశక్తి - మంత్రాలయం

టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్.రాఘవేంద్ర రెడ్డి గెలుస్తారని, చంద్రబాబు ముఖ్యమంత్రి అవుతారని బెట్టింగ్ కాసిన గుజ్జల చిన్నన్నపై బైండోవర్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గోపీనాథ్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడారు. మండలంలోని వగరూరు గ్రామానికి చెందిన బోయ గుజ్జల నరసప్ప కుమారుడు బోయ గుజ్జల చిన్నోడు రెండెకరాల పొలం పందెం కాశారని తెలిపారు. ఈ పొలం విలువ సుమారు రూ.50 లక్షలు ఉంటుందని కోసిగి మాజీ జడ్‌పిటిసి మంగమ్మపై పందెం కాసిన విషయం సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఈ నేపథ్యంలో మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు చిన్నన్నను, ఆయనకు సహకరించిన బోయ ఈరన్న, బోయ తిక్కన్నను అరెస్టు చేసి తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ రాఘవేంద్ర ఎదుట హాజరు పరిచినట్లు తెలిపారు. బైండోవర్ కేసు నమోదు చేసి పూచీకత్తుతో వదలి వేసినట్లు చెప్పారు.



అల్లర్లకు పాల్పడితే చర్యలు : డీఎస్పీ

ప్రజాశక్తి - ఆస్పరి

గ్రామాల్లో అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పత్తికొండ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి హెచ్చరించారు. శనివారం స్థానిక పోలీసు స్టేషన్ ఆవరణంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. సిఐ హనుమంతప్ప అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా పత్తికొండ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి హాజరయి మాట్లాడారు. మండలంలో ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరిగిందన్నారు. ఈనెల 4న ఎన్నికల కౌంటింగ్ జరగనుందని తెలిపారు. ఈ నేపథ్యంలో గ్రామాల్లో గొడవలు, డిజె, బాణసంచా కాల్చడం వంటి కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. రెచ్చగొట్టేలా ఎవరూ వ్యవహరించ వద్దని, నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమస్యాత్మక గ్రామాల్లో పోలీసు సిబ్బందితో నిఘా ఉంచామని తెలిపారు. ఎన్నికల ఫలితాలు ఏ పార్టీలకు అనుకూలంగా ఉన్నా అన్నదమ్ముల్లాగా కలిసిమెలిసి ఉండాలన్నారు. ఈనెల 6 వరకు సభలు, సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలు చేయరాదని తెలిపారు. సర్పంచులు, ఎంపిటిసిలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

బాబును కలిసిన మీనాక్షి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని



విదేశీ పర్యటన అనంతరం హైదరాబాద్ చేరుకున్న టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడును హైదరాబాదులోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశామని ఆదోని మాజీ ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు మీనాక్షి నాయుడు తెలిపారు. శనివారం ఆయన చరవాణి ద్వారా మాట్లాడారు. గత నెల 13న జరిగిన ఆదోని నియోజకవర్గంలో పోలింగ్ సరళిపై చర్చించారని తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి తప్పకుండా విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

విచ్చలవిడిగా డొమెస్టిక్ సిలిండర్లు వినియోగం

- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - ఆదోని

డివిజన్ కేంద్రమైన ఆదోనిలో నిబంధనలకు విరుద్ధంగా డొమెస్టిక్ సిలిండర్ల వినియోగం విచ్చలవిడిగా సాగుతోంది. తనిఖీలు నిర్వహించి అరికట్టాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. కమర్షియల్ సిలిండర్లకు బదులుగా డొమెస్టిక్ సిలిండర్ల వినియోగం పెరుగుతోందని చెబుతున్నారు. రెస్టారెంట్లు, హోటళ్లు, బార్‌లలో కమర్షియల్ సిలిండర్లు వినియోగించాల్సి ఉంది. అధికారులు తనిఖీలు చేయకపోవడంతో వారు కూడా డొమెస్టిక్ సిలిండర్లను వాడి ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నారని పలువురు చెబుతున్నారు. ఆదోని బిఎన్ టాకీస్ రోడ్డు వద్ద ఉన్న బజ్జీల దుకాణం యజమాని డొమెస్టిక్ సిలిండర్లను వ్యాపారానికి వినియోగించుకుంటున్నారు. రోజుకు ఏకంగా ఐదు డొమెస్టిక్ సిలిండర్లు ఉపయోగిస్తున్నట్లు తెలిసింది. ఇంటి వంటకాలకు వాడే సిలిండర్లు అక్రమంగా తన సొంత వ్యాపారానికి వాడుకుంటున్నారు. ఇటు ప్రజల నివాసానికి ఉపయోగించే సిలిండర్లు ఇలా దుకాణాలకు అధికంగా వాడడంతో డొమెస్టిక్ సిలిండర్ల ధరలు ఆకాశానికి అంటాయని పలువురు పేర్కొంటున్నారు. ఒక్క చిరు వ్యాపారం చేసే వారే ఒక రోజు ఐదు డొమెస్టిక్ సిలిండర్లు వాడుతుంటే ఇక హోటల్, రెస్టారెంట్లు, బార్‌లలో వినియోగం సంగతి చెప్పాల్సిన అవసరం లేదు.

రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టాలి

రెవెన్యూ అధికారులు విచారణ జరిపి వ్యాపారానికి డొమెస్టిక్ సిలిండర్లు ఎందుకు వాడుతున్నారో ఆరా తీయాల్సిన అవసరం ఉంది. పట్టణంలో తనిఖీలు నిర్వహించి వ్యాపారానికి డొమెస్టిక్ సిలిండర్లు వాడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


ఆదోనిలోని హోటల్‌లో ఉన్న డొమెస్టిక్ సిలిండర్లు


ఎస్ఎస్ ట్యాంకు నీటిని పరిశీలిస్తున్న నాసర రెడ్డి

తాగునీటి సమస్య రాకుండా చూసుకోవాలి

- జడ్‌పి సిఇఒ నాసర రెడ్డి

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్లతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా చూసుకోవడంతోపాటు ప్రత్యేక శ్రద్ధతో తాగునీటిని శుద్ధి చేసి పంపిణీ చేయాలని జిల్లా పరిషత్ సిఇఒ నాసర రెడ్డి తెలిపారు. శనివారం ఆయన గోనెగండ్లలోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును పరిశీలించారు. ట్యాంకులో నీటి నిల్వ, గ్యాస్ క్లోరినేషన్ ప్రక్రియను పరిశీలించారు. రాబోవు వర్షాలను దృష్టిలో పెట్టుకొని బ్లీచింగ్ పౌడర్‌ను వాడాలని సూచించారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ శ్రీనివాసరెడ్డి, ఇఒఆర్‌డి నాగేష్, పంచాయతీ కార్యదర్శి సతీష్, మురళీ నాయుడు, అడ్వకేట్ చంద్ర పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి

ప్రజాశక్తి - పెద్దకడబూరు

మండలంలో హనుమాన్ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. పెద్దకడబూరులో ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. హనుమాన్ ప్రభోత్సవాన్ని పురవీధుల గుండా ఊరేగించారు. కమ్మలదిన్నె గ్రామంలో వైసిపి యువ నాయకులు అళ్లయ్య, రంగమునిలు మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి మరోసారి గెలవాలని, రాష్ట్రంలో మరోసారి వైసిపి అధికారంలోకి రావాలని పూజలు చేశారు. కమ్మలదిన్నె మాజీ ఎంపిటిసి గోవిందు, ఎంపిటిసి వీరేష్, పెద్ద భీమరాయుడు, పెద్దకడబూరులో ఆలయ పెద్దలు లింగన్న, కృష్ణమూర్తి, హనుమన్న, బయప్ప, రామాంజిని, పూజారి బసవరాజు, బజారి, వెంకటేష్, నారాయణ, రంగన్న, గుంటెప్ప, గణేష్, చిరంజీవి, నాగరాజు పాల్గొన్నారు. **హోళగుంద**లో హనుమాన్ జయంతి సందర్భంగా ఊరు బయట గల అగ్రహారం ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి భక్తులు పూజలు చేశారు. అలంకరణ, అభిషేకంతోపాటు ధూపం, నైవేద్యం, మంగళ హారతి అందించి పూజలు నిర్వహించారు. శనివారం కూడా భక్తులు ఇక్కడ అధిక సంఖ్యలో పాల్గొంటారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో స్వామి దేవాలయం ఉండడం ఆనందించదగ్గ విషయమని భక్తులు పేర్కొంటున్నారు. వచ్చిన భక్తులకు ఉచిత అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. **దేవనకొండ** మండలంలోని పి.కోటకొండ, దేవనకొండ క్రాస్ రోడ్డులో కొలువైన ఆంజనేయ స్వామి రథోత్సవాలు వైభవంగా జరిగాయి. స్వామివారి ఆలయంలో భక్తాదులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పి.కోటకొండ గ్రామంలోని యోగాంజనేయ స్వామి ఆలయ వ్యవస్థాపకులు యోగేశ్వరరావు, ఆలయ కమిటీ ఛైర్మన్ హనుమంతు రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. ఆయా గ్రామాల్లో ఆంజనేయ స్వామి చిత్రపటాలకు ఊరేగింపు నిర్వహించారు.

కౌతాళంలో నాయీ బ్రాహ్మణులు శ్రీఅనంత మంగళ మారుతి సాయిరామ్ దేవస్థానంలో హనుమాన్ జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. గంగా జలాన్ని మేళతాళాలతో ఊరేగింపు ద్వారా తీసుకొచ్చి స్వామి వారికి అభిషేకం చేశారు. అనంతరం అర్చకులు వేదమంత్రాలతో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటుచేశారు.

ప్రముఖుల పూజలు : రాజకీయ పార్టీల నాయకులు పూజలు నిర్వహించారు. వైసిపి మండల కన్వీనర్ దేశాయి ప్రహ్లాద చారి, వైస్ ఎంపిపి బుజ్జి స్వామి, సర్పంచి పాల్ దినకరన్, అబ్దుల్ సమద్, ఉమాపతి, వడ్డే ఉసేని, సింగిల్ విండో అధ్యక్షులు దాట్ల కృష్ణంరాజు, మారుతి మోహన్, దాట్ల సుబ్బరాజు, రాఘవేంద్ర రెడ్డి, ఉలిగయ్య, ఉపేంద్ర, టిడిపి నాయకులు వెంకటపతి రాజ్, కాశీ విశ్వనాథ్, రాజానందు వేర్వేరుగా పూజలు చేశారు. వారికి నాయీ బ్రాహ్మణ సంఘం తరఫున సన్మానం చేశారు. అభయాంజ నేయ స్వామి చిత్రపటాన్ని పురవీధుల్లో మేళతాళాలతో ఊరేగించారు.

పెద్దకడబూరులో ప్రభోత్సవం నిర్వహిస్తున్న గ్రామస్తులు



హోళగుందలో అన్నదానం నిర్వహిస్తున్న సభ్యులు


స్నేహితునికి ఆర్థిక సహాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

స్నేహితునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కోసిగి

కాలు, చేయి పడిపోయిన స్నేహితునికి పూర్వ విద్యార్థులు ఆర్థిక సహాయం అందజేశారు. సొంత అన్నదమ్ములను, బంధువులను పట్టించుకోని ఈ రోజుల్లో ఆపదలో 'మేము సైతం ఆదుకుంటామ'ంటూ 2002-03 10వ తరగతి పూర్వ విద్యార్థులు ఆపన్న హస్తం అందజేశారు. స్నేహానికి ప్రాధాన్యమిస్తూ తమతో కలిసి చదివిన స్నేహితునికి ఆపద వచ్చిందని తెలిసి తమ సొంత కష్టార్జితంతో ఆర్థిక సహాయం అందజేశారు. కోసిగి మండలం బెళగల్ గ్రామానికి చెందిన వికలాంగుడు, కురువ ఉరుకుంద డిగ్రీ, బిఇడి వరకు చదువుకొని ఇంటి దగ్గర ట్యూషన్ చెప్పుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గత వారం క్రితం హైబిపి వచ్చి కాలు, చేయి పడిపోయాయి. ఏమీ దిక్కు తోచని స్థితిలో కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తీసుకొని వెళ్లారు. పరిస్థితి విషమించడంతో ఐసియుకు తరలించారు. మూడు, నాలుగు రోజులు స్థిమితం లేకుండా పడిపోయాడని, మాటలు కూడా రాలేకపోయాయని కుటుంబీకులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఉరుకుంద తోటి విద్యార్థులు సొంత డబ్బులు పోగు చేసి రూ.30 వేలను శనివారం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి వెళ్లి అందించారు. తామున్నామంటూ, ధైర్యంగా ఉండాలంటూ పూర్వ విద్యార్థులు భరోసా ఇచ్చారు. ఉరుకుందుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. రామకృష్ణ, చిదానంద, రామాంజనేయులు, దినేష్, హనుమంతు, హుస్సేన్ బాష పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై సస్పెన్షన్ ఎత్తేయాలి

- ఎస్‌టియు రాష్ట్ర కౌన్సిలర్ మహదేవప్ప

ప్రజాశక్తి - ఆదోని

ఎన్నికల విధులకు హాజరుకాని ఉపాధ్యాయులపై సస్పెన్షన్ ఎత్తేయాలని ఎస్‌టియు రాష్ట్ర కౌన్సిలర్ బి.మహదేవప్ప, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి ఎంసి.సుంకన్న డిమాండ్ చేశారు. శనివారం ఎస్‌టియు భవన్‌లో సమావేశం నిర్వహించారు. మండల అధ్యక్షులు చింతకుంట రామకృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సాధారణ ఎన్నికల పిఒ, ఎపిఒ, ఒపిఒ తదితర ఎన్నికల విధులకు నియమించిన కొంతమంది ఉపాధ్యాయులు తీవ్ర అనారోగ్య కారణాల వల్ల, మహిళా ఉపాధ్యాయులు, చంటి పిల్లల అనారోగ్య కారణాల రీత్యా విధులకు హాజరు కాలేకపోయారని తెలిపారు. అట్టి పరిస్థితుల్లో వారిపై సస్పెన్షన్ వేటు వేయడం సమంజసం కాదన్నారు. మానవతా దృక్పథంతో వారిపై ఉన్న సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేసి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ఎన్నికల విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు రెమ్యూనరేషన్ విషయంలో ఒక్కో జిల్లాలో ఒక్కో విధంగా ఉందని తెలిపారు. రాష్ట్రమంతటా ఒకేలా ఉండేటట్లు చూసి, జిల్లాలో జరిగిన ఎక్కువ, తక్కువలను సరిజేయాలని కోరారు. ఎస్‌టియు జిల్లా కార్యదర్శి బి.గోపాల్, జిల్లా ఆర్థిక కమిటీ సభ్యులు బి.రామాంజనేయులు, మండల ప్రధాన కార్యదర్శి బి.సుధాకర్, మండల గౌరవాధ్యక్షులు ఎల్.రామ్మోహన్ రెడ్డి, కోశాధికారి పి.షేక్షావలీ పాల్గొన్నారు.